క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు



హన్మంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్‌ను వీడిన ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు నివాసంలో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సరాపు యాదగిరి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు నాగరాజు, ఇతర నాయకులు, కార్యకర్తల మెడలో కండువా కప్పిన మైనంపల్లి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఇతర నాయకులున్నారు.

రైలుమార్గం వేయాలి

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్‌జోన్: మెదక్ నుంచి మీర్జాపల్లి వరకు రైల్వేలైన్ వేయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మెదక్ రైల్వే సాధన సమితి నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్కన్నపేట నుంచి మెదక్ వరకు రైల్వేలైన్ కోసం ఏకంగా రైల్వే సాధనసమితి కమిటీ వేసి, ఏళ్ల తరబడి పోరాటం చేయటంతోనే మెదక్‌కు రైల్వేలైన్ సాధించామన్నారు. మెదక్ నుంచి మీర్జాపల్లి వరకు రైల్వే కోసం మరో ఉద్యమం చేపడతామని, దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలను కలిసి వినతిపత్రాలను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రగౌడ్, ఎంఎల్ఎన్ రెడ్డి, యాదగిరిగౌడ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం



మున్నూరుకాపు మండల కార్యవర్గం

పెద్దశంకరంపేట(మెదక్): మండల మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురుపాదగుట్ట వద్ద నిర్వహించిన సమావేశంలో మండలాధ్యక్షుడిగా బుగుడాల సాయిలు, ఉపాధ్యక్షుడిగా సుభాష్, కార్యదర్శిగా మన్నె రాధాకృష్ణ, కోశాధికారిగా రాయిని రాములు, సంయుక్త కార్యదర్శిగా ఎల్లయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాయిని మధు, కోణం విఠల్, సత్యనారాయణ, జనార్దన్ తదితరులున్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



బోనాలతో కాలనీ వాసులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ప్రియాంక కాలనీలో నూతనంగా ప్రతిష్ఠించిన ముత్యాల పోచమ్మ ఆలయ ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఆదివారం కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి నుంచి మహిళలు శివసత్తుల నృత్యాలు, మంగళవాయిద్యాల మధ్య బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

చెక్కుల పంపిణీ



చెక్కులను అందిస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ, తుపాకులపల్లి గ్రామాలకు చెందిన 6 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసినట్లు బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీరామ్ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, ఆంజనేయులు, మల్లేశ్, రాములు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఖజానా’ దూరం.. తప్పని భారం

- ఎస్‌టీఓ మంజూరై ఐదేళ్లు దాటినా.. ఏర్పాటులో నిర్లక్ష్యం
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఉద్యోగులు



వృథాగా పాత పోలీస్‌స్టేషన్ భవనం



పాత పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఖాళీ స్థలం

అల్లాదుర్గం(మెదక్): ఖజానా కార్యాలయం లేక ఉద్యోగులు, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. చిన్న తప్పు దొర్లినా 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్యాలయానికి పరుగులు తీయాల్సిందే. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాంట్రాక్టర్ల బిల్లులు పాస్ కావాలంటే ఎస్‌టీఓ కార్యాలయం అవసరం. ప్రతీ నెల ఉద్యోగుల జీతాలు, ఇతర శాఖ బిల్లులు డ్రా చేసుకునేందుకు ఉప కోశాధికారి కార్యాలయంలో సమర్పిస్తారు. బిల్లులు పాసైతేనే డబ్బులు తీసుకునే అవకాశం ఉంది. అలాంటి ఖజానా కార్యాలయం మంజూరై ఐదేళ్లు అవుతున్నా... కార్యాలయం ఏర్పాటు మాత్రం కలగానే మిగిలింది.

- అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్ మండలాలు మెదక్ ఎస్‌టీఓ కార్యాలయం పరిధిలో ఉన్నాయి. రేగోడ్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట మండలాలకు ఎస్‌టీఓ కార్యాలయం 60 కిలోమీటర్ల దూరంలోని మెదక్‌కు వెళ్లాల్సి వస్తుంది. ఏడేళ్ల క్రితం జిల్లాల పునర్విభజనలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాలు సంగారెడ్డి జిల్లా నుంచి మెదక్ జిల్లాలో కలిపారు. అంతకు ముందు ఎస్‌టీఓ కార్యాలయం జోగిపేట పట్టణంలో ఉండేది. పునర్విభజన తర్వాత మెదక్ ఎస్‌టీఓ కార్యాలయం పరిధిలోకి వచ్చాయి. మెదక్ ఈ మండలాలకు 60 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో బిల్లులు తీసుకొని వెళ్లడానికి ఒక రోజు పడుతుందని ఉద్యోగులు, కాంట్రాక్టర్లు చెబుతున్నారు. చిన్న తప్పు వచ్చినా.. మరో రోజు వెళ్లాల్సి వస్తుందన్నారు. రేగోడ్ మండలంలోని పలు గ్రామాలకు మెదక్ 70 కిలోమీటర్ల దూరం అవుతుందన్నారు. ఉద్యోగులు, ఆయా శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు బిల్లులు చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.
- అల్లాదుర్గం మండలం టేక్మాల్, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాలకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఐదేళ్ల క్రితం అల్లాదుర్గంలో ఎస్‌టీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులకు వినతి ప్రతాలు సమర్పించారు. అల్లాదుర్గంలో ఎస్‌టీఓ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎస్టీఓ కార్యాలయం మంజూరు చేస్తూ సంబంధిత అధికారులు ఆదేశాలు ఇచ్చారు. కార్యాలయం కోసం భవనాలు సహితం జిల్లా కోశాధికారి అల్లాదుర్గం వచ్చి చూసి వెళ్లి నాలుగేళ్లు దాటింది. అల్లాదుర్గంలో ఎస్‌టీఓ కార్యాలయం ఏర్పాటైతే ఉద్యోగులకు సమయం, ఖర్చులు సహితం ఆదా అవుతాయి. అల్లాదుర్గం ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు సహితం ఎస్టీఓ కార్యాలయం ఏర్పాటు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి మూడేళ్లు గడిచింది. ఇప్పటికీ కార్యాలయం మాత్రం ఏర్పాటు కాలేదు.
- అల్లాదుర్గంకు మంజూరైన ఎస్టీఓ కార్యాలయం పాత పోలీస్ స్టేషన్ భవనం ప్రస్తుతం భవనం వృథాగా ఉందని, అందులో ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు అంటున్నారు. భవనం పక్కన 10 గుంటల వరకు ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం కార్యాలయాలకు కేటాయించి, సొంత భవనాలు నిర్మించొచ్చని తెలిపారు. ఎస్‌టీఓ కార్యాలయం ఏర్పాటు కాకున్న రెవెన్యూ అధికారులు భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపడం గమనార్హం. ఇప్పటికైన అల్లాదుర్గంలో ఎస్‌టీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



శివ్వంపేట(నర్సాపూర్): క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కరుణాకర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన దివంగత చింతల మహేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తరిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. మహేందర్‌రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన వ్యక్తి మన మధ్యలో లేనప్పటికీ ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయన్నారు. యువతలో స్నేహభావం పెంపొందించాలనే సంకల్పంతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవలింగం, రాజు, అనీల్, శంకర్, శివ, తదితరులు ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి

యువత వారికి నచ్చిన క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన గుణ తారక్ నేషనల్ వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడంతో ఆదివారం క్రీడాకారున్ని సన్మానించి నవీన్‌గుప్తా నగదు అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చేడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ నచ్చిన రంగాల్లో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేశ్, ప్రభులింగం గౌడ్, శ్రీనివాస్, మల్లేశ్, షేక్‌అలీ ఉన్నారు.

మానసిక ఉల్లాసం

తూప్రాన్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సీఐ రంగాకృష్ణ అన్నారు. పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ అకాడమీని మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించడం వల్ల అనేక ప్రయోజనాలున్నారు. చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్సాన్, నాయకులు మోజెస్, యువకులు పాల్గొన్నారు.

నేడు శిశుమందిర్‌లో సామూహిక అక్షరాభ్యాసం

పెద్దశంకరంపేట(మెదక్): వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతి శిశుమందిర్‌లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు వీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని పేరూర్ గరుడగంగా మంజీరా తీరంలో ఉన్న సరస్వతి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు విద్యాభ్యాసం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రాజమౌళి తెలిపారు.

తపస్ జిల్లా కార్యదర్శిగా నరేశ్



రేగోడ్(మెదక్): తపస్ జిల్లా కార్యదర్శిగా నరేశ్ (రేగోడ్ మండలం వెంకటాపూర్ పాఠశాల) ఎన్నికైనట్లు మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో తపస్ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సంఘం రాష్ట్ర, జిల్లా శాఖ ఆదేశాలను పాటిస్తూ, ఉపాధ్యాయులకు, విద్యారంగానికి సేవలు అందిస్తానన్నారు.

అతిగా మద్యం తాగి..

తూప్రాన్: అతిగా మద్యం సేవించిన యువకుడు వైన్స్ పర్మిట్ గదిలో మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్(40) ఆదివారం ఉదయం నుంచి నర్సాపూర్ చౌరస్తాలోని మద్యం దుకాణంలో మద్యం తాగి మృతుడు శ్రీనివాస్‌గౌడ్, పర్మిట్ గదిలోనే మృతి చెందినట్లు వైన్స్ నిర్వాహకులు తెలిపారన్నారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

కూలీ బీమా ప్రవేశపెట్టాలి

గజ్వేల్‌రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు రైతుబీమా మాదిరిగానే కూలీ బీమాను ప్రవేశపెట్టాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు కోరారు. ఉపాధిహామీ కూలీ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని కొల్గూరులో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకు అమలు చేస్తున్న రూ.2లక్షల ప్రమాద బీమాను రూ.10లక్షలకు పెంచాలని, పనులు చేపట్టిన కూలీకి రూ.600 ఇవ్వాలన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మనోహరాబాద్(తూప్రాన్): మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 7న చేపట్టే బహిరంగ సభకు అందరూ తరలి రావాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మురళి కోరారు. ఆదివారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పెద్దింటి ధర్మేష్, ఉపాధ్యక్షులుగా సదానంద్, పూర్ణస్వామి, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణం, కార్యదర్శిగా ప్రభాకర్, ఆర్గనైజర్‌గా పవన్, శేఖర్, నర్సింహ, ఆంజనేయులు, రాజులను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ చేపట్టిన ఎస్సీ, ఎస్టీ ఏబీసీడీ వర్గీకరణకు చేపట్టిన సభకు అందరు రావాలని, కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. అనంతరం బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని మూసాపేటకు చెందిన యువ చైతన్యం యూత్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మాదిగలు ఎమ్మార్పీఎస్‌లో చేరారు. ఈనెల 7న హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన 1000 గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి యాదగిరి, యువ చైతన్యం యూత్ సభ్యులు, మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం స్పందించి వెంటనే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చెందర్, ప్రసాద్, ప్రభాకర్, కుమార్ తదిరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మూసాపేటలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

ఘనంగా బీరప్ప బోనాల ఊరేగింపు

మండలంలోని బొడ్మట్‌పల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం బోనాలను గ్రామ పుర వీధుల గుండా వీర గంధాల వేషాధారణలతో నృత్యాలు చేస్తూ ఊరేగించి ఆలయం వద్ద స్వామి వారికి సమర్పించారు.

– టేక్మాల్(మెదక్):



బొడ్మట్‌పల్లిలో బోనాల ఊరేగింపు

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆవాహితదేవత పూజ, చండీ యాగం, వాస్తు సర్వతోభద్ర, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ హోమాలు,. దాన్య, పుష్ప, శయ్య అధివాసాలు, మంగళ హారతి, మంత్రపుష్పం వంటి పూజలు నిర్వహించారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కనుల పండువగా జరిగాయి. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి వారి ఆధ్వర్యంలో ఆవాహిత దేవతా పూజలు, హోమాలు, గర్త సంస్కారములు చేశారు. అనంతరం ఉత్తరాభాద్ర నక్షత్ర యుక్త మేష లగ్నమందు యంత్ర ప్రతిష్ఠ, అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేశారు. మహా పూర్ణాహుతి నిర్వహించి, అమ్మవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలు ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు.

తిమ్మాపూర్‌లో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం గ్రామ అర్చకులు బాపురావ్‌శర్మ, మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో ఎల్లమ్మదేవి యంత్ర, విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం సభ్యులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

దుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని దండుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ ఆలయ వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, గణపతి హోమం, పుణ్యావచనం, అమ్మవారికి అభిషేకాలతో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించారు.

గౌడ కులస్తులు ఐక్యంగా ఉండాలి

గౌడ జనహక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): గౌడకులస్తులు ఐక్యంగా ఉండాలని గౌడజనహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం కౌడిపల్లిలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద 2025 సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడకులస్తుల ఐక్యతతోనే మనహక్కులను సాధించుకోవచ్చన్నారు. ఎక్సైజ్ అధికారులు గౌడకులస్తులను వేధించడం ఆపాలన్నారు. కల్లుగీత వృత్తిని నమ్ముకొని బతుకుతున్న గీతాకార్మికులను కల్తీకల్లు అమ్ముతున్నారంటూ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ దుర్గాగౌడ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణాగౌడ్, పుండరీకం గౌడ్, మోతిలాల్‌గౌడ్, చంద్రంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కౌడిపల్లిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్

శిఖంలో ప్లాట్ల విక్రయాలు

- తక్కువ ధరకు వస్తున్నాయని కొనుగోలు
- లబోదిబోమంటున్న కొనుగోలుదారులు

చిన్నశంకరంపేట(మెదక్): పట్టాపేరుతో ప్లాట్లు చేసి విక్రయించగా కొనుగోలు చేసిన అమాయకులు తాము కొనుగోలు చేసిన భూమి శిఖం అనితేలడంతో నోరేళ్లబెడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఎకంగా 13 ఎకరాలలో శిఖం భూమిని ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటు చేయడంతో ప్లాట్ల కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఐబీ బంగ్లాకు ఎదురుగా సూరారం రోడ్ పక్కన కొత్తకుంట ఉంది. ఈ కుంట శిఖం భూమి 13.14 గుంటలు ఉండాల్సి ఉండగా, కొందరు అక్రమార్కులు శిఖం భూమిలో కొన్నాళ్లుగా సాగుభూమిగా మార్చి పంటలు పండించారు. కరువుతో కుంటచెరువు ఎప్పుడు నిండకపోవడంతో శిఖం భూమి విషయం వెలుగోలోకి రాలేదు. ఈ భూమి పక్కనే చక్కర ఫ్యాక్టరీ ఉండగా, నష్టాలతో వారు దాన్ని తొలగించి భూమిని విక్రయించారు. ఇప్పుడు దానినే వెంచర్‌గా మార్చి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా ఈ భూమి పక్కనే ఉన్న శిఖం భూమిని కూడా కొందరు అక్రమార్కులు పట్టాభూమిగా నమ్మించి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు చేశారు. ఇందులో కొందరు ప్లాటు వద్ద బోరువేసి మోటార్ బిగించి, ఇంటి నిర్మాణ పనులు కూడా చేశారు. తీరా అధికారులకు ఈ విషయం తెలియడంతో స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వేచేసి శిఖం భూమిలో హద్దులు గుర్తించారు. ఇది ప్రభుత్వ భూమి అంటు బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేసిన అనేక మంది ఇప్పుడు లబోదిబోమంటూ తమ పరిస్థితి ఎంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శిఖంభూమిని గుర్తించి ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

కొత్తకుంట శిఖం భూమిలో ప్లాట్లు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కొత్తకుంట శిఖంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన చర్యలు తీసుకుంటాం. అలాగే ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా ఎవరు నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వచ్చి ఫిర్యాదు చేస్తే, వారికి న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– మన్నన్, తహసీల్దార్

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మదూర్, శాలిపేట సబ్‌స్టేషన్‌ల్లో సోమవారం మరమ్మతులు చేపట్టనున్నట్లు చిన్నశంకరంపేట ట్రాన్స్‌కో ఏఈ దినకర్ తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు విషయం గమనించి సహకరించాలని కోరారు.

◆ పశువు కళేబరంతో ఇబ్బందులు

నర్సాపూర్: రోడ్డుపై పశువు కళేబరంతో రాత్రి పూట ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ తూప్రాన్ రహదారిపై అటవి ప్రాంతంలో 15 రోజులుగా పశువు కళేబరం ఉందని తెలిపారు. రాత్రి పూట కళేబరం సరిగా కన్పించడం లేదని, చిన్న వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు దానిని గుర్తించి, తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

◆ కనులపండువగా మల్లన్న కల్యాణోత్సవం



హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లి మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. ఆదివారం ఆలయ అర్చకుడు ఉదయం స్వామివారికి ఆలయ సంప్రోక్షన, అఖండ జ్యోతిప్రజ్వలన, బ్రహ్మకలశ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని వీక్షించేందుకు ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

◆ నల్లపోచమ్మ ఆలయంలో పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి సమీపంలోని నల్లపోచమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం దేవాదయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేశ్ నల్ల పోచమ్మకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి దర్శనానికి భక్తులు తరలి వచ్చారు.

◆ షార్ట్ సర్క్యూట్‌తో బేకరి దగ్ధం



నర్సాపూర్: పట్టణంలోని ఓ బేకరి ఆదివారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఆదివారం ఉదయం తమ బేకరి లోపల నుంచి మంటలు, పొగలు వస్తున్నాయని యజమాని శ్రీకాంత్ చెప్పారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారని ఆయన చెప్పారు. కాగా దుకాణంలోని సామగ్రి మొత్తం కాలిపోయిందని, తమకు సుమారు రూ.మూడు లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ కొనసాగుతున్న సికింద్లాపూర్ జాతర

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ధనుర్మాసంలో ప్రారంభమై ప్రతీ ఆదివారం మూడు నెలల పాటు జాతర నిర్వహిస్తారు. కోనేరు పక్కనున్న ఆలయంతో పాటు కొండపైన కొలువైన లక్ష్మీనర్సింహస్వామికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది నర్సింహరెడ్డి, విద్యాకర్‌చారి ఉన్నారు.

◆ దండుపల్లిలో వసంత పంచమి పూజలు

మనోహరాబాద్(తూప్రాన్): వసంత పంచమిని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని దండుపల్లి బాల్యం స్కూల్‌లో వసంత పంచమి పూజలతో పాటు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.